

పట్టాలు తీసుకొన్న ఆనందంలో విద్యార్థులు


నమస్తే తెలంగాణ

# వరంగల్

5 | వరంగల్, శనివారం 7 జూన్ 2025 | WARANGAL


## గుండెపోటుతో హనుమకొండ తహసీల్దార్ హఠాన్మరణం



తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తదితరులు

హనుమకొండ, జూన్ 6: హనుమకొండ తహసీల్దార్ కర్ర శ్రీపాల్‌రెడ్డి(46) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. కాలికి గాయమైనప్పటికీ కోలుకొని ఇటీవలే మళ్లీ విధుల్లో చేరారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈయన స్వస్థలం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం కాగా ఉద్యోగరీత్యా హనుమకొండలోని కుడా కాలనీలో నివాసం ఉంటున్నారు. శ్రీపాల్‌రెడ్డికి భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బావ్‌సింగ్ శ్రీపాల్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

# స్నాతకోత్సవ సంబురం

- ఎస్సార్‌యూలో ఘనంగా కాన్వొకేషన్
- సినీ సంగీత దర్శకుడు కీరవాణికి డాక్టరేట్ ప్రదానం
- హాజరైన ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌రెడ్డి
- విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, డిగ్రీ పట్టాలు అందజేత

హసన్‌పర్తి, జూన్ 6 : అనంతసాగర్ శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో స్నాతకత్సోవ సంబురం నెలకొంది. శుక్రవారం మూడో కాన్వొకేషన్ ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌రెడ్డి, సినీ సంగీత దర్శకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి హాజరయ్యారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎంఎం కీరవాణి చేసిన విశేష సేవలను గుర్తుంచి ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కీరవాణి 'మౌనంగానే ఎదుగమని మొక్కనీకు చెబుతుంది' అనే పాటను పాడి విద్యార్థుల మనసును దోచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో మెదిలితే అనుకున్న లక్ష్యం వైపు చేరుతారన్నారు. ఎస్సార్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి నాకు డాక్టరేట్‌ను ప్రదానం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వరదారెడ్డిని చాన్స్‌లర్‌గా కాకుండా ప్రతి ఒక్కరూ గురువుగా, దేవుడిగా చూడడం చాలా ఆశ్చర్యం వేసిందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు. తెలుగు సినిమాకు గొప్ప సేవలందించిన సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు ఇదే యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకుపోయి దేశం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయా లన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేశారు. విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్లు మధుకర్‌రెడ్డి, మహేశ్, వీసీ దీపక్‌గార్గ్, అర్చనారెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### ఇది విద్యార్థుల జీవితాల్లో ఒక మైలురాయి

స్నాతకోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇది విద్యార్థుల జీవితాల్లో ఒక మైలు రాయి. ఇంజినీర్లు ఆవిష్కర్తలు, సమస్యల పరిష్కారకులుగా విద్యార్థులు ప్రపంచ సమస్యలను ఎదుర్కోనే శక్తిని సంతరించుకున్నారు. యూనివర్సిలోమౌలిక సదుపాయాలు, అధ్యాపకుల సేవలు బాగున్నాయి. ఎస్సార్ యూనివర్సిటీ గత మూడేళ్లలో నేషనల్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో ఉండడం విశేషం. ఇండియాలో విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. క్వాంటం టెక్నాలజీ, కృత్రిమ మేధస్సులాంటి రంగాల్లో భారత్ అగ్రగామిగా ఉంది. – *డాక్టర్ సతీశ్‌రెడ్డి, ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు*



కీరవాణికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వరదారెడ్డి, సతీశ్‌రెడ్డి

### ఓరుగల్లు అంటే చాలా ఇష్టం

ఓరుగల్లు అంటే చాలా ఇష్టం. ఇక్కడికి రావడం హ్యాపీగా ఉందని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ ఎస్సార్ యూనివర్సిటీలోని వాతావరణం, వారు చూపిన ప్రేమను నా జీవితంలో మరిచిపోనన్నారు. సినీ రంగానికి తాను చేసిన సేవలను గుర్తించి ఎస్సార్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినందుకు ఆనందంగా ఉందని చెప్పారు. తాను రామోజీరావు దర్శకత్వంలో చేసిన మొదటి సినిమా 'మనసు –మమత'తో పరిశ్రమలో నిలదొక్కుకున్నానని తెలిపారు. నేను చాలా మందిని సంగీత దర్శకులుగా తయారుచేసిన. వారందరూ సినీ డైరెక్టర్లుగా పనిచేస్తున్నారన్నారు. ఎంత పని వచ్చినా ప్రతి రోజూ ఏదో కొత్తదనం నేర్చుకోవాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా యూనిట్‌లో అందరం పనిచేస్తేనే ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చింది. ఇందుకు గర్వంగా ఉంది. ఎంత ఎదిగినా అంత ఒదిగి ఉండడం వల్ల మనకు మంచే జరుగుతుందన్న నమ్మకం ఉందని చెప్పారు. – *ఎంఎం కీరవాణి, ప్రముఖ సంగీత దర్శకుడు*

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి అడుగులు

**దేశంలో వంట నూనెల లోటును పూడ్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహించింది. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను తెరపైకి తెచ్చి రైతులను చైతన్యపరచడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో పంట చేతికొచ్చే సమయానికి మార్కెటింగ్ ఎలా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ములుగు మండలం ఇంచర్ల సమీపంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయం తీసుకోవడంతో పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లా రైతులకు ప్రయోజనం కలుగనున్నది.**

– ములుగు, జూన్6 (నమస్తేతెలంగాణ)



ఇంచర్ల సమీపంలోని నర్సరీలో ఆయిల్ పామ్ మొక్కలు

### దిగుబడి సుంకం తగ్గింపుతో నష్టం

కేంద్ర ప్రభుత్వం తాజాగా ముడి వంట నూనెలపై బేసిక్ దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించ డంతో ఆయిల్ పామ్ రైతులపై నష్ట ప్రభావం పడనున్నది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఇండోనేషియా, మలేషియా నుంచి పెద్ద ఎత్తున క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి కానున్నది. ఇప్పటికే ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.18 వేలకు పడిపోయింది. ముున్ముందు ధరలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

### ఎకరానికి రూ.2లక్షల ఆదాయం

గత ప్రభుత్వం రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు రూ. 11చొప్పున చెల్లిస్తేనే ఒక్కో మొక్కను అందిస్తున్నది. నీరు సమృద్ధిగా ఉన్న సారవంతమైన నేలల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే నాలుగేండ్ల నుండి 30 ఏండ్ల వరకు నిరంతరం ఆదాయం పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లోటన్నుకు రూ. 20 వేల నుంచి 25వేలకు పైగా ధర ఉంది. ఈ లెక్కన ఎకరానికి రూ.2లక్షల ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రెండో సంవత్సరం నుంచి కాత వచ్చే వరకు పెద్దగా పెట్టుబడి అవసరం ఉండదు. మూడేళ్ల వరకు మక్కజొన్న, మిరప, పెసర, మినుములు, కూరగాయలు, పూల మొక్కలను అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. అకాల వర్షాలు, గాలి బీభత్సం వచ్చినా పంటలకు నష్టం ఉండదని, పశువులు, కోతులు కూడా దీన్ని నష్టపర్చలేవని రైతులు పేర్కొంటున్నారు.


### ఇంచర్ల సమీపంలో 12 ఎకరాల భూమి కేటాయింపు

- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రోత్సాహంతో వేలాది ఎకరాల్లో పంట సాగు
- పరిశ్రమతో ఉమ్మడి జిల్లా రైతులకు ప్రయోజనం



సంప్రదాయ పంటల నుంచి రైతులను మరల్చి ప్రత్యామ్నాయం వైపు తీసుకెళ్లేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించింది. ఇందులో భాగంగా ఉచితంగా మొక్కలు, డ్రిప్ పరికరాలను రాయితీపై అందజేసి పంట సాగు నుంచి కొనుగోలు వరకు అన్ని బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అందించింది. దీంతో ములుగు జిల్లాలో 763 మంది రైతు లు ముందుకు వచ్చి 2,648 ఎకరాల్లో పామాయిల్ పంటను సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై దృష్టి పెట్టలేదు. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఇంచర్ల సమీపంలో జాతీయ రహదారి 163కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల్లో 12 ఎకరాల ను ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నది.

# బరితెగించారు..!



- వరంగల్ బల్దియాలో రాసలీలలు
- సెక్షన్‌లోనే కౌగిలింతలు, ముద్దులు
- పని ప్రదేశంలో ఉద్యోగుల కామకేళి
- ఆలస్యంగా వెలుగులోకి.. విచారణకు కమిషనర్ ఆదేశం

వరంగల్, జూన్ 6 : నగర ప్రజలకు పౌర సేవలు అందించాల్సిన కార్యాలయంలో కొందరు సిగ్గూఎగ్గూ లేకుండా శృంగార కార్యకలాపాలు సాగిస్తున్నారు. పని ప్రదేశంలోనే బరితెగించి ఇకఇకలు, పకపకలతో పాటు ముద్దులు పెట్టుకుంటూ రాసలీలల్లో మునిగితేలుతూ కామకేళి సాగిస్తూ గ్రేటర్ వరంగల్ పరువును బజారుకీడుస్తున్నారు. అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసిన ఈ రాసలీలల ఘటన కొద్ది రోజుల క్రితం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరుగగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నాలుగు రోజులక్రితం జూనియర్ అకౌంట్ ఆఫీసర్లుగా ఉద్యోగంలో కొత్తగా చేరిన ఇద్దరు ఏకంగా సెక్షన్‌లోనే రాసలీలకు తెరలేపారు. భోజన విరామ సమయంలో కౌగిలింతలు, ముద్దులు పెట్టుకుంటుండగా కొందరు వీడియోలు తీయడంతో విషయం బయటికి పొక్కింది. సదరు ఉద్యోగులను సెక్షన్ సూపరింటెండెంట్ మందలించినట్లు సమాచారం. అయినా, మార్పు రాలేదని సహచరులు గుసగుసలాడుతున్నారు. కమిషనర్ దృష్టికి వెళ్లడంతో ఘటనపై విచారణకు అదనపు కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

**బజారున బల్దియా పరువు**

మినీ సచివాలయంగా పిలిచే బల్దియా ప్రధాన కార్యాలయం పరువు బజారున పడిందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పదవుల్లో మహిళలు ఉన్న కాలంలోనే ఇలాంటి జుగుప్సాకరమైన ఘటనలు జరగడం గమనార్హం. బల్దియా ఉద్యోగుల పనితీరుపై నిఘా పెట్టాలని, ప్రతి సెక్షన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఉద్యోగులపై పర్యవేక్షణ లేకపోవడంతో బల్దియా కార్యాలయ పాలన గాలికి వదిలివేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియాలో జరిగిన ఈ ఘటనపై విచారణ జరిపి సంబంధిత ఉద్యోగులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్

# అక్రమ కేసులకు భయపడం

### బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్

కాజీపేట, జూన్ 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్‌ఎస్ పార్టీని అణచివేయాలని చూస్తున్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ అన్నారు. ప్రశాంత్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను శుక్రవారం కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేసి, వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్కతుర్తిలో ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వాహనాల్లో భారీగా తరలివెళ్తుండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఆటంకాలు సృష్టించాయన్నారు. భూపాలపల్లి నుంచి సభకు వెళ్లే వాహనాలను ఉప్పల్ రైల్వేగేటు మీదుగా దారి మళ్లించి, ఉద్దేశపూర్వకంగా 2గంటలపాటు నిలిపివేసినట్లు తెలిపారు. దాదాపు పది కిలోమీటర్లు వేలాది వాహనాలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ రైల్వే గేట్‌వద్ద ఆందోళన చేయడంతో రైల్వే అధికారులు కొద్ది సేపటి తర్వాత గేటు తెరిచారని చెప్పారు. రైల్వే పట్టాల వద్ద ఆందోళనను చేపట్టినందుకు ఆర్పీఎఫ్ పోలీసులు 14మంది బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పతదని హెచ్చరించారు. కాగా, ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించినందుకు సిరికొండ ప్రశాంత్, తాటి జనార్దన్, గురుకుంట్ల కిరణ్, ఎర్ల రాజు, కంచెర్ల ప్రకాశ్, శశికాంత్ గౌడ్, బియాని పూర్ణను మొత్తం ఏడుగురిని అరెస్ట్ చేసి, వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని, మరికొందరు పరారీలో ఉన్నట్లు కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపారు. వీరిపై ఆర్పీఎఫ్ యాక్టు ప్రకారం నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# నకిలీ బంగారంతో బురిడీ



ఆంధ్రప్రదేశ్ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ కార్యాలయం

- మహేశ్ బ్యాంకు నుంచి రూ.43.5 లక్షల లోన్
- ఉద్యోగులు, ఖాతాదారులు కలిసి దోపిడీ
- డీజీఎం ఫిర్యాదుతో 9 మందిపై కేసు
- పునరావృతమవుతున్న నకిలీ బంగారం లోన్ ఘటనలు

వరంగల్ చౌరస్తా, జూన్ 6 : బంగారం ధర పెరగడంతో సామాన్య కుటుంబాలు ఇబ్బంది పడుతుంటే, కేటుగాళ్లకు మాత్రం మంచి అవకాశంగా మారింది. బ్యాంకు ఉద్యోగులు, బంగారు నాణ్యతను పరిశీలించి, నిర్ధారించే అప్రైజర్లను మచ్చిక చేసుకొని లక్షలు నొక్కేస్తున్నారు. ఇదే తీరుగా వరంగల్‌లో మరో ఘటన వెలుగు చూసింది. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో నెల వారీ వడ్డీ చెల్లింపు విధానంలో శివనగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ 145 గ్రాముల నకిలీ బంగారంపై రూ.8లక్షలు, గుంటూరు ప్రాంతానికి చెందిన లక్ష్మీశిరీష 764 గ్రాముల నకిలీ బంగారంపై రూ.18.5 లక్షలు, హంటర్ రోడ్డు ప్రాంతానికి చెందిన రజిత పేరుతో 278 గ్రాముల నకిలీ బంగారంపై రూ.17లక్షల లోన్ తీసుకున్నారు. నిబంధనల ప్రకారం లోన్ వడ్డీ చెల్లించని కారణంగా అనుమానం కలిగిన బ్యాంకు అధికారులు బంగారం లోన్‌కు సంబంధించి ఆడిట్ చేపట్టారు. దీంతో అసలు విషయం బయటపడింది. కుదువ పెట్టిన బంగారం నకిలీదిగా గుర్తించి, విచారణ చేపట్టారు. ఈ విషయంలో బ్యాంకు మేనేజర్ శివకృష్ణతోపాటు కే రాముశర్మ, జీవిత్‌కుమార్, బ్రహ్మాచారి, పీ రాజమౌళి, వీ కరుణాకర్‌తోపాటుగా లోన్ తీసుకున్న ఖాతాదారులు కావాలనే బ్యాంకును మోసం చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

***ధర పెరుగుదలే అవకాశంగా..***

ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం బంగారం మార్కెట్ విలువలో 65 శాతం వరకు లోన్‌గా ఇవ్వడానికి అవకాశం కల్పించింది. వడ్డీ రేటును బట్టి ఈ విలువను పెంచుతూ పోతుంటారు. ఈ నిబంధనను ఆసరాగా చేసుకొని బ్యాంకు ఉద్యోగులు, అప్రైజర్లు కొందరు నకిలీ ఖాతాదారులతో కలిసి లోన్ స్కాంలకు పాల్పడుతున్నారు. వరంగల్ ప్రాంతానికి చెందిన ఓ హాల్ మార్క్ సెంటర్ నిర్వాహకుడు తన సెంటర్‌లోనే ఇత్తడి ఆభరణాలకు పుత్తడిగా నకిలీ హాల్‌మార్క్ ముద్రలు వేసి నకిలీ బంగారాన్ని అసలు బంగారంగా చూపి తన సహచరులు, మిత్రుల పేర్లతో సుమారు కోటి రూపాయల వరకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో లోన్ తీసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ధరల పెరుగుదల, అప్రైజర్లు, ఉద్యోగులు సైతం సహకరించడంతో ఈ విధానంలో రోజు లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత ధర తగ్గినట్లయితే ఇలాంటి ఘటనలు చాలానే బయటపడే అవకాశాలు ఉన్నట్లు పలువురు వ్యాపార నిపుణులు తెలుపుతున్నారు.

## నేతన్నల బతుకు మార్చింది కేసీఆరే..

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఎర్రబెల్లిని సన్మానిస్తున్న పద్మశాలి ఎన్‌ఆర్‌ఐ సంఘం నాయకులు

దేవరుప్పుల, జూన్ 6: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల ఆత్మహత్యలు లేని రోజు ఉండేది కాదని, ప్రత్యేక తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ వారికి అనేక పథకాలు అందించి చేయూతనిచ్చారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. డాలస్‌లో తెలంగాణ పద్మశాలి ఎన్‌ఆర్‌ఐ సంఘంతో ఎమ్మెల్సీ రమణతో కలిసి ఆయన సమావేశమై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేనేతకు పూర్వవైభవం వచ్చిందన్నా రు. అప్పుల నుంచి బయట పడి ఆత్మగౌరవంగా బతికే స్థితిలో నేతన్నల కుటుంబాలు ఉన్నాయని, అనేక ప్రాం తాల్లో టెక్స్‌టైల్ పార్కులు నెలకొల్పి వారిని ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ సభ విజయవంతానికి తోడ్పడిన పద్మశాలి కుటుంబాలకు ఎర్రబెల్లి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పద్మశాలి ఎన్‌ఆర్‌ఐ బృందం మాజీ మంత్రి దయాకర్‌రావును, ఎమ్మెల్సీ రమణను సన్మానించారు.

## సియటెల్‌లో మాజీ ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం



మాజీ ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

కృష్ణ కాలనీ, జూన్ 6 : అమెరికాలోని డాలస్ నగరంలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ, బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతిశుక్రవారం సియటెల్ నగరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ యూఎస్‌ఏ విభాగం నాయకులు కే వంశీరెడ్డి, మిత్ర బృందం పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి భారీ కారు ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు సియోటెల్‌లోని (మైక్రోసాఫ్ట్ క్వాడ్రెంట్ ఆఫీస్) అంతర్జాతీయ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు.

### బియ్యం ఇచ్చేదెప్పుడో?



**రేషన్ కోసం సంచుల క్యూ**

*మూడు నెలల రేషన్ బియ్యం ఒక్కసారి ఇచ్చుడేమో గానీ లబ్ధిదారులు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల తెల్లవారుజామునే రేషన్ దుకాణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. శుక్రవారం హనుమకొండ కుమార్‌పల్లిలోని రేషన్‌షాపు వద్ద ఇలా సంచుల వరుసలో పెట్టగా, మూడు రోజుల నుంచి రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నా బియ్యం ఇవ్వడం లేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.* – హనుమకొండ చౌరస్తా, జూన్ 6

## నకిలీ సీడ్స్, పెస్టిసైడ్స్ ముఠాల గుట్టురట్టు

- విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్న ఏడుగురి అరెస్ట్
- రూ. 63.62 లక్షల విలువైన సరుకు స్వాధీనం : సీపీ సన్‌ప్రీత్‌సింగ్



నకిలీ విత్తనాలు, పురుగు మందులను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

సుబేదారి, జూన్ 6: నకిలీ పు రుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న రెండు ముఠాలను టాస్క్‌ఫోర్స్, పరకాల, గీసుగొండ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ నిందితులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు మారబోయిన తిరుపతి ములుగు ఘన్‌పూర్ మండలం పాపయ్యప ల్లికి చెందిన అన్నం కుమారస్వామి, మేడ్చల్‌కు చెందిన జయదీప్ గతమ్, మెహిదీపట్నంకు చెందిన ముద్దంగుల ఆదిత్య ముఠాగా ఏర్పడి మెహిదీపట్నంలో నకిలీ పురుగు మందులు తయారుచేసి విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో తిరుపతి ఇంటిలో పోలీసులు దాడులు చేయగా రూ. 57.44 లక్షల విలువైన నకిలీ, కాలం చెల్లిన పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. జయదీప్ గౌతం, ఆదిత్య, కుమారస్వామిని అరెస్ట్ చేశామన్నారు.

**నకిలీ విత్తనాల కేసులో..**

గీసుగొండ మండలం ఎల్కుర్తి గ్రామానికి చెందిన మర్రిరెడ్డి, సంగారెడ్డి చింతల చెరువు గ్రామా నికి చెందిన తుమ్మగుండ్ల సందీప్‌రెడ్డి, తుమ్మగుండ్ల విజయజోసెఫ్ ముఠాగా ఏర్పడి రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు మర్రిరెడ్డి ఇంటిపై దాడి చేసి రూ. 6.18 లక్షల విలువైన 166 కిలోల నకిలీ విత్తనాలు, 800 లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో ప్రతిభ చూపిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, పరకాల, మామునూరు ఏసీపీలు సతీశ్‌బాబు, వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, సార్ల రాజు, రంజిత్, పరకాల, గీసుగొండ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందిని సీపీ అభినందించారు.